క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థానికులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, గాంధీజీవీధి వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు మల్కాపురం సబ్‌స్టేషన్ విద్యుత్ శాఖ అధికారులు గురువారం స్థలాన్ని పరిశీలించారు. గాంధీజీవీధి శివారు ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించారు. దీనికి సంబంధించిన స్థానికుల అభిప్రాయాలను సేకరించనున్నారు.

ఘనంగా కుంకుమార్చన


కుంకుమార్చన పూజల్లో పాల్గొన్న భవానీ భక్తులు

మల్కాపురం : జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపలెం,రామాలయం వద్ద దుర్గాదేవికి గురువారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భవానీ భక్తులు చండీపూజలను నిర్వహించారు. మహిళలు,భవానీ భక్తులు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారి కీర్తనలను ఆలపించి భజనలను చేశారు. ఈ పూజా కార్యక్రమంలో పిలకవానిపాలెం ప్రాంత భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

రిటైర్డ్ అధికారులకు ఘన సత్కారం


కార్యక్రమంలో పాల్గొన్న నేవీ అధికారులు

సింథియా : తూర్పు నావికాదళంలో సుదీర్ఘ కాలం పనిచేసి పదవీ విరమణ పొందిన అధికారులను గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా ఏవీఎస్ఎం, ఎన్ఎం చీఫ్ ఆఫ్ స్టాఫ్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశ భద్రతలో అధికారులు ప్రదర్శించిన ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో పలువురు నేవీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జోరుగా కాలువ నిర్మాణం


కాలువ నిర్మాణ పనులను చేపడుతున్న దృశ్యం

మల్కాపురం : జీవీఎంసీ 58వ వార్డు పరిధి ఉప్పరకాలనీ, గుల్లలపాలెం తదితర ప్రాంతాల్లో వీధి కాలువల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో వీధి కాలువలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. దీంతో మురుగు వెళ్లే మార్గం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యేవి. సమస్యను అధికారుల దృష్టికి స్థానికుల తీసుకువెళ్లడంతో స్పందించి యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులను చేపడుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గోపాలపట్నం : కొత్తపాలెం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా శుక్రవారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గోపాలపట్నం, బాజి జంక్షన్, నరసింహనగర్, ఇందిరానగర్, చంద్రానగర్, కొత్తపాలెం, ఎల్లపువానిపాలెం, గణేష్‌నగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

చేపట్టిన పనులు ఇవే..

- బస్‌బేల నిర్మాణం రూ.72 లక్షలు
- విమాన్ నగర్‌లో సీసీ రోడ్, డ్రైన్ల నిర్మాణం రూ.47.83 లక్షలు
- కాకానినగర్‌లో సీసీ రోడ్స్, డ్రైన్ల నిర్మాణం రూ.12 లక్షలు
- హైవే బ్యూటిఫికేషన్ రూ.19.75 లక్షలు
- బస్ షెల్టర్ వద్ద మరమ్మతులు రూ.8.20 లక్షలు
- షీలానగర్ నుంచి ఎన్ఏడీ ఫ్లై ఓవర్ వరకు (జీ-20 పనులు) రూ.1 కోటి

కాకానినగర్.. సూపర్







కాకానినగర్‌లోని కమ్యూనిటీ హాల్

- మెరుగుపడిన సౌకర్యాలు
- మౌలిక వసతులు పెంపొందించడమే లక్ష్యంగా పనులు
- డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం
- రాజకీయాలకు అతీతంగా నిధుల కేటాయింపు


హైవే నుంచి కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి


కాలనీలో నిర్మించిన సిమెంట్ రోడ్డు



కాకాని నగర్ వద్ద నిర్మించిన బస్ బే


అంతర్గత రహదారుల్లో నిర్మించిన డ్రైనేజీ

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గం 90వ వార్డు పరిధిలోకి వచ్చే కాకానినగర్ అభివృద్ధిపై నగర పాలక సంస్థ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఇక్కడ టీడీపీ కార్పొరేటర్ ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, రాజకీయాలకు అతీతంగా అన్ని కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జీవీఎంసీ అధికారులు తగిన కార్యాచరణతో ముందుకు వెళుతున్నారు. కాకానినగర్, విమాన్ నగర్, వినోద్ నగర్‌లు కలిసే ఉంటాయి. దీంతో మూడు కాలనీలను అనుసంధానం చేస్తూ మౌలిక వసతులు పెంపొందిస్తున్నారు. ఈ కాలనీలకు సమీపాన ఎయిర్‌పోర్టు, దీనికి సంబంధించిన కార్యాలయాలు ఉండటం, హైవేకు ఆనుకొని ఉండడంతో ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకునే వారి సంఖ్య కూడా క్రమేపీ పెరుగుతోంది. దీంతో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

కాకానినగర్, విమాన్‌నగర్, వినోద్ నగర్‌లో అంతర్గత రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారు. కాలనీల్లో ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకొని పలు చోట్ల సిమెంటు రోడ్లు నిర్మించారు. మురుగు నీరు బయటకు పోయేందుకు సరైన ఏర్పాట్లు లేకపోవటంతో దీనిపై గత పాలకులెవ్వరూ పెద్దగా దృష్టి పెట్టలేదు. ఇలాంటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా డ్రైనేజీలను పటిష్టం చేశారు. సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు, మురుగు నీరు బయటకు పోయేలా ఇదే సమయంలో రహదారికి ఇరువైపులా పక్కా డ్రైనేజీలను ఏర్పాటు చేశారు.

ఏళ్లనాటి సమస్యకు మోక్షం

రజకకాలనీలో రహదారి నిర్మాణం చేపట్టాలని అక్కడి ప్రజానీకం ఏళ్ల తరబడి అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా, ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. ఏపీఎంఎస్ఎంఈడీసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రజకకాలనీ సందర్శించగా, అక్కడి ప్రజలు తమ చిరకాల డిమాండ్‌ను విన్నవించారు. వారి సమస్యను జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, కాలనీలో రూ.20 లక్షలతో పక్కా సీసీ రోడ్డును నిర్మించేలా ఆడారి ఆనంద్ కుమార్ ప్రత్యేక చొరవ చూపారు. ఇలాంటి అనేక సమస్యలకు మోక్షం లభిస్తోంది.

ప్రజావసరాలు తీర్చేలా పనులు



రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రజావసరాలు తీర్చేలా కాలనీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఏపీఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ సహకారంతో కాలనీల్లో రహదారులు, డ్రైనేజీలను అభివృద్ధి చేశారు. సమస్య ఉందనే చెబితే, దాన్ని పరిష్కరించేలా ఆనంద్ కుమార్ ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారు.

– నమ్మి శ్రీను

సమస్యలు తీరుతున్నాయి



మా కాలనీల్లో సమస్యలు పరిష్కారమౌతున్నాయి. గతంలో అయితే ప్రజా ప్రతినిధుల ఇష్టం మేరకు కాలనీల్లో రోడ్లు వేసేవారు. కానీ ఇప్పుడు పార్టీలతో పనిలేదు. మా కాలనీలో సమస్యను చెబితే చాలు, కచ్చితంగా పరిష్కారం అవుతుందనే నమ్మకం కలిగింది. సచివాలయం అందుబాటులో ఉన్నందున ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కారమౌతున్నాయి.

– టీ. గుణవతి, వినోద్ నగర్

గతానికీ ఇప్పటికీ ఎంతో తేడా



కాలనీల అభివృద్ధే లక్ష్యంతో ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పనులు చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు, కాలనీల్లో పెత్తనం చేసే వారిని ప్రసన్నం చేసుకుంటేనే కానీ పనులు జరిగేవికావు. కానీ ఇప్పుడు పార్టీలకు అతీతంగా అభివృద్ధి జరుగుతోంది. ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారు.

– బీఎస్. కృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

సౌకర్యాలు మెరుగు



కాలనీలో సౌకర్యాలు గతంలో కంటే బాగా మెరుగుపడ్డాయి. అంతర్గత రహదారులు, డ్రైనేజీ కాలువ నిర్మాణాలు జరిగాయి. మా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితులు గతంలో ఉండేవి. ఇప్పుడైతే, సమస్యలు తెలుసుకొని పరిష్కరించే వారు అందుబాటులో ఉన్నారు. వార్డులో విశేషంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

– సమ్మెట్ల రామకృష్ణ, కాకాని నగర్

క్రీడాపోటీల్లో 'బెహరా' విద్యార్థులకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులతో బెహరా విద్యాసంస్థల డైరెక్టర్ బెహరా విజయ చైతన్య

గోపాలపట్నం : విశాఖపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లాల అంతర జిల్లా ఆటల పోటీల్లో నరవ బెహరా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటు కున్నారు. 15 ఈవెంట్లలో 36 పతకాలు సాధించారు. ఈ మేరకు పతకాలు గెలిచిన విద్యార్థులను బెహరా విద్యా సంస్థల డైరెక్టర్ బెహరా విజయ చైతన్య అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు క్రీడల్లో రాణించి పతకాలు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. జనవరిలో అనంతపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో 20 మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య, పీడీలు ప్రవీణ్, అమర్, బాబు, లావణ్య, సంగీత అధ్యాపకులు పాల్గొన్నారు.

మేడ పైనుంచి జారి పడి మహిళ మృతి


మృతి చెందిన విశాలాక్షి

గోపాలపట్నం: మేడపై నుంచి జారి పడి మహిళ మృతి చెందిన సంఘటన ప్రహ్లాదపురం సమీపంలోని సింహాద్రినగర్‌లో చేటుచేసుకుంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సింహాద్రినగర్‌లో నివాసముంటున్న చిట్టూరి విశాలాక్షి (47) నివాసముంటుంది. భర్త చాలా కాలం క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి ఆమె మతిస్థిమితం కోల్పోయింది. విశాఖ మానసిక వైద్యాలయంలో చికిత్స పొందుతోంది. తండ్రి సుబ్బారావు కొద్ది కాలం కుమార్తె వద్ద ఉంటూ చికిత్సనందించేవాడు. ఇటీవల ఆయన సొంత ఊరు వెళ్లిపోయాడు. బుధవారం అర్ధరాత్రి మేడపైకి వెళ్లిన విశాలాక్షి ప్రమాదవశాత్తు పక్కవారి ఇంటి ప్రాంగణంలో పడిపోయింది. గురువారం ఉదయం పక్క ఇంటి కుటుంబ సభ్యులు చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోపాలపట్నం ఎస్ఐ అప్పలనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. తండ్రి సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సంతోష్ కుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ అప్పలనాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీ కోసం శ్రమిద్దాం


యువజన విభాగం నేతలో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: ఇటీవల నియమితులైన యువజన విభాగం మండల అధ్యక్షులతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ తన క్యాంప్ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆదేశించారు. యువజన విభాగం మండల అధ్యక్షులు శరడం సురేష్, బి.సంతోష్, జి.వరం, కె.సంతోష్ రాజ్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ


రమ్యకు డబ్బులు అందజేస్తున్న క్రైం డీసీపీ వెంకటరత్నం

ఆరిలోవ: ఆటోలో మరిచిపోయిన బ్యాగును బాధిత మహిళకు అందజేసి ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నాడు. ఆరిలోవ క్రైం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 25న విమ్స్ ఆస్పత్రి వద్ద జి.రమ్య, తల్లిదండ్రులతో కలిసి ఆటో ఎక్కి ఆరిలోవలో బాలాజీనగర్ వద్ద దిగారు. ఆ సమయంలో తమ వెంట తీసుకొచ్చిన రూ.45 వేలు నగదుతో ఉన్న బ్యాగును ఆటో మరిచిపోయి దిగిపోయారు. ఇంటికి వెళ్లిన అనంతరం చూసేసరికి డబ్బులు ఉండే బ్యాగు కనిపించకపోవడంతో వెంటనే ఆరిలోవ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలాజీనగర్ వద్ద ఉన్న 25వ తేదీకి సంబంధించిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆటోను గుర్తించారు. టీబీసీ పాయింట్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ ఎస్‌కే మస్తాన్ నిజాయితీగా ఆటోలో తనకు దొరికిన రూ.45 వేలు నగదును తీసుకొచ్చి పోలీసులకు అప్పగించాడు. దీంతో గురువారం క్రైం డీసీపీ పి.వెంకటరత్నం బాధితురాలు రమ్యను పిలిపించి నగదు అందజేశారు. నిజాయితీగా వ్యవహరించిన మస్తాన్‌ను అభినందించి, ఆరిలోవ క్రైం పోలీసులకు బాధిత మహిళ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ద్వారకా క్రైం సీఐ ఇమాన్యుయేల్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్రా'


షటిల్ డబుల్స్ ఆడుతున్న మహిళలు


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

గోపాలపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలతో గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాల గ్రౌండ్ సందడిగా మారింది. గురువారం ఉదయం నుంచి పలు అంశాల్లో క్రీడలు నిర్వహించారు. బాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, క్రికెట్ పోటీలు జరిగాయి. ఆయా సచివాలయా పరిధిలో బాడ్మింటన్ పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఆరు మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో క్రీడాకారులు పోటీ పడ్డారు.

సందర్శించిన జోనల్ కమిషనర్

ఆడుదాం ఆంధ్రా పోటీలను జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు పరిశీలించారు. క్రికెట్ మ్యాచ్‌కు టాస్ వేసి ఆటను ప్రారంభించారు. కొద్ది సేపు ఆయన బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. గురువారం నాలుగు జట్ల మధ్య పోటీలు జరిగాయి. జిల్లా పరిషత్ పాఠశాల గ్రౌండ్‌లో కబడ్డీ రెండు జట్లు బాడ్మింటన్ 6 జట్లు, వాలీబాల్ మూడు జట్లు, ఖోఖో మూడు జట్ల మధ్య పోటీలు నిర్వహించారు. సచివాలయ పరిధిలో చిన్నచిన్న మైదానాల్లో మహిళల బాడ్మింటన్ మ్యాచ్‌లు ఐదు జరగగా..పురుషుల బ్యాడ్మింటన్ పోటీలు నాలుగు జరిగాయి. పోటీలను పలు పాఠశాలల పీడీలు పర్యవేక్షించారు. ఏపీడీ శ్రీరామ్ ఏర్పాట్లను పరిశీలించారు.


ఖోఖో ఆడుతున్న మహిళలు


కబడ్డీ రూల్స్ వివరిస్తున్న పీడీ


బ్యాటింగ్ చేస్తున్న జెడ్సీ మల్లయ్య నాయుడు

సాయిబాబాకు వైభవంగా పల్లకి సేవ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీలో గల శ్రీ షిర్డీ సాయిధ్యాన మందిరంలో బాబా వారికి గురువారం రాత్రి పల్లకి సేవ వైభవోపేతంగా జరిగింది. ఉదయం బాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకం నిర్వహించిన అనంతరం ప్రత్యేక అలంకరణగావించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజలు చేశారు. సాయంత్రం నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షులు విల్లా సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ వద్ద నాగుల చవితి పార్కు అభివృద్ధి పనులు చేపడుతున్నందున భక్తులు భాగస్వామ్యం కావాలని కోరారు.

గవర్నర్‌కు స్వాగతం


గవర్నర్‌ని స్వాగతిస్తున్న వీసీ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడానికి నగరానికి విచ్చేసిన గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌ని ఏయూ అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన గవర్నర్‌కు ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్‌లు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

వైభవంగా శ్రీవారికి తిరుప్పావడ సేవ


గజ వాహనంపై శ్రీవేంకటేశ్వరస్వామి


తిరుప్పావడ సేవలో వెంకన్న

ఎంవీపీ కాలనీ: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ఉదయం తిరుప్పావడ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న స్వామి వారి ఎదుట పులిహోర కుప్పగా పోసి, వడలు నివేదించారు. అనంతరం నిత్యాగోష్ఠిలో పాల్గొన్న భక్తు లందరికీ వడలు, పులిహోర, దద్ధోజనం, పొంగలి ప్రసాదం అందజేశారు. సాయంత్రం కార్యక్రమంలో భాగంగా శ్రీభూనీలా సహిత శ్రీనివాసుడు గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయ దేవేరులతో తిరువీధి వేడుకలో స్వామి వారు ఎంవీపీ కాలనీ సెక్టార్-6, సెక్టార్-2, సెక్టార్-3 వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. దారి పొడవునా స్వామివారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకొని ఆశీస్సులు తీసుకున్నారు.